# 'ప్రజావాణి'పై పట్టింపేది?

- వందల్లో ఫిర్యాదులు.. పదుల్లో పరిష్కారం
- అసంతృప్తిలో ఫిర్యాదుదారులు



అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్, మే 12: ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో విపరీతమైన జాప్యం నెలకొంటుందనే విమర్శలు వస్తున్నాయి. వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తుండగా, కేవలం పదుల సంఖ్యలో మాత్రమే పరిష్కారానికి నోచుకుంటున్నాయనే ఆవేదన అర్జీదారుల నుంచి వ్యక్తమవుతోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఉన్నతాధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకుంటే న్యాయం జరగడంలేదని వాపోతున్నారు. సత్వర న్యాయం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదులు అందజేస్తున్నా.. కొన్నిశాఖల యంత్రాంగం మినహా మిగతాశాఖల్లో మాత్రం ప్రజావాణి ఫిర్యాదులపై ఎలాంటి స్పందన కానరావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటూ, పరిష్కరించినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారనే విమర్శలున్నాయి. ఫిర్యాదు చేసిన వారికి సమస్య పరిష్కారమైతే అయినట్లు, కాకుంటే ఎందుకు కాలేదో వివరణతో కూడిన సమాధానం 15రోజుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఇవేమీ పాటించకుండా ఫిర్యాదు దారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో అర్జీదారులు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతుండడం షరా మామూలుగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సోమవారం నాటి ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి 264 మంది దరఖాస్తులు అందజేయగా, వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందిన ఫిర్యాదులే ఉన్నాయి. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి తోపాటు అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కే మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

మా గ్రామ శివారులోని సర్వేనంబర్ 215లో 28గుంటల భూమిని 2011లో అప్పటి ప్రభుత్వం తన పేరిట పట్టా చేసి.. కాగితాలు అందజేసింది. 15ఏండ్లుగా తమ కుటుంబం ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. 2024లో తహసీల్దార్‌గా వచ్చిన రమేశ్ సారు మా కొడుకును ఆఫీస్‌కు పిలిపించుకున్నాడు. మీకు ఇచ్చిన భూమి పట్టా రద్దు చేయకుండా ఉండాలంటే రూ.5లక్షలు ఇవ్వాలని అడిగిండు. మా వద్ద డబ్బుల్లేవని చెప్పినా పట్టించుకుంటలేడు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే.. తాను బదిలీ అయి వెళ్లేలోగా పట్టా రద్దు చేస్తానంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. తన భూమిలో ఉన్న గుంతను పూడ్చుతుండగా రెవెన్యూ అధికారులను పంపి మెమో ఇచ్చిండు. కులం సర్టిఫికేట్ కోసం నా కోడలు దరఖాస్తు చేసుకుంటే ఇవ్వడం లేదు. సదరు అధికారిపై చర్యలు తీసుకుని, తమ కుటుంబం ఆత్మహత్య చేసుకోకుండా కాపాడండి.



బోయిని దేవేంద్ర కుటుంబ సభ్యులు, ముదిమాణిక్యం (చిగురుమామిడి)

### డంపింగ్ యార్డు ఎత్తివేయండి



డంపింగ్ యార్డు బాధితులు

నగర సమీపంలోని మానేరు నది ఒడ్డున ఉన్న డంపింగ్‌యార్డుతో కొన్నేళ్ల నుంచి కోతిరాంపూర్, అలకాపురి, హౌసింగ్‌బోర్డు ప్రాంతాల్లోని తాము ఇబ్బంది పడుతున్నాం. యార్డు నుంచి వచ్చే పొగ, వాసన భరించలేక రోగాల పాలవుతున్నాం. పసి పిల్లలు, గర్భిణులు, వయోవృద్ధుల బాధలు వర్ణనాతీతం. దగ్గు, దమ్ము, గుండె సంబంధిత వ్యాధులబారిన పడుతున్నాం. వెంటనే డంపింగ్ యార్డు ఎత్తివేసి, వేలాది మందిని అనారోగ్యాల బారినుంచి కాపాడాలి.

- కోతిరాంపూర్,
అలకాపూరి ప్రాంతాల వాసులు



నగరంలో ర్యాలీ తీస్తున్న ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది

# భారత సైన్యానికి సంఘీభావంగా టీఎన్జీవోల ర్యాలీ



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు, టీఎన్జీవోల సంఘం జిల్లా నాయకులు, ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు

కలెక్టరేట్, మే 12 ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో భారీ సద్భావన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించగా.. ప్రతిమ మల్టీప్లెక్స్, బస్టాండ్, సీఎస్ఐ చర్చి మీదుగా అమరవీరుల స్థూపం వరకు ర్యా లీ కొనసాగింది. ర్యాలీ లో వివిధ ఉద్యోగ సం ఘాల నాయకులు, సభ్యులు, యువజన, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పా ల్గొన్నారు. ఉగ్రదాడిలో వీరమరణం పొందిన జవాన్ల పోరాటాన్ని కీర్తిస్తూ నినదించారు. పాకిస్థాన్ దాడిలో గాయపడి మరణించిన అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటాలతోపాటు జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ, ఆయన కుటుంబానికి మద్దతు తెలిపారు. అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, సంతాపం ప్రకటించారు. ర్యాలీలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, అర్బన్, రూరల్ అధ్యక్షులు హర్మిందర్ సింగ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు పెండ్యాల కేశవరెడ్డి, రెవెన్యూ అధికారుల సంఘం ప్రతినిధులు, నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రభుత్వోద్యోగుల సంఘం నాయకులు, డిఫెన్స్ అకాడెమీ, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, బాలభవన్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ఆద్యంతం పోలీసుల బందోబస్తు, డ్రోన్ కెమెరాల నిఘా మధ్య కొనసాగింది.

# 19నుంచి డిగ్రీ హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 12: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బ్యాచులర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండో సెమిస్టర్, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 19నుంచి ప్రారంభమవుతాయని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19నుంచి 30వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. 2019 బ్యాచ్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించామని చెప్పారు. విద్యార్థులు మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని లేదా ఆయా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.



హోంగార్డు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సీపీ

## హోంగార్డు కార్యాలయం తనిఖీ

కరీంనగర్, మే 12 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం సోమవారం హోంగార్డు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ఎప్పటికప్పుడు వాటిని నవీకరిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వారు నిర్వర్తిస్తున్న విధులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఇతర శాఖల్లో ఉన్న హోంగార్డుల వివరాలను కూడా ఆయన తెలుసుకున్నారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల పనితీరుపై ఆరా తీశారు. వారు మరింత అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా బూర శ్రీనిధి తండ్రి శ్రీనివాస్, నివాసం. రాంనగర్, కరీంనగర్ గారు మహ్మద్ అబ్దుల్ మన్నన్, తండ్రి మహ్మద్ అబ్దుల్ వాహిద్, ఇ.నెం. 7-4-212 ముకరంపుర, కరీంనగర్ గారి నుండి కరీంనగర్ పరిధిలోని బొమ్మకల్‌లోని చాణక్యపురిలో సర్వే నెం. 38/A, ప్లాటు నెం 26 యొక్క విస్తీర్ణము 289 చ.గ.లను రిజిష్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 10660/2005 ద్వారా ఖరీదు చేసినారు. దీనికి హద్దులు తూర్పు: ప్లాటు నెం 27, పడమర: రాగి బద్రయ్య గారి భూమి, ఉత్తరం: ప్లాటు నెం 37E & F, దక్షిణం: 20 ఫీట్ల రోడ్. ఇట్టి ప్లాటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం. 5197/1980 గలది పోయినదని బూర శ్రీనిధి గారు తెలిపినారు. ఇట్టి విషయమై PS-II టౌన్, కరీంనగర్ గారికి ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకున్న పోలీస్ వారు ఇట్టి దస్తావేజు దొరకలేదని సర్టిఫికేట్ నెం. 15202904251208232521 ద్వారా ధృవీకరించినారు. కావున ఇట్టి దస్తావేజుపై లేదా పై ప్రాపర్టీపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల (7) రోజులలో వ్రాతపూర్వక ఆధారాలతో క్రింది వారికి తెలుపగలరు.

ఇట్లు: **కస్తూరి ప్రకాష్,** అడ్వకేట్
ఇ.నెం. 2-10-1292, జ్యోతినగర్, కరీంనగర్.
సెల్: 99856 38238

# నాడు కొడుకు.. నేడు తండ్రి

- రెండు నెలల వ్యవధిలో ఇద్దరు మృతి
- మన్నెంపల్లిలో విషాదం



తిరుపతిరావు (ఫైల్)

తిమ్మాపూర్, మే11: ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై రెండు నెలల క్రితం ఎదిగిన ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోగా.. రందీతో ఆ తండ్రి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతిరావు (48)కు నిఖిల్‌రావు ఒక్కగానొక్క కొడుకు. నిఖిల్‌రావు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై, గత మార్చి10న వారి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తిరుపతిరావు, ఆయన భార్య మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో తిరుపతిరావు ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి భార్యకు ఫోన్ చేశాడు. ఆమె వెంటనే కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. కొడుకు, భర్త మృతితో తిరుపతిరావు భార్య, కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కంటతడిపెట్టించింది. నాడు కొడుకు, నేడు తండ్రి ఆత్మహత్య చేసుకోగా మన్నెంపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, మే 12 : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిసిస్తూ ఈ నెల 20 తేదీన నిర్వహిస్తున్న దేశ వ్యాప్తసార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపు నిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో సోమవారం నిర్వహించిన ఆశ కార్యకర్తలు జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరిస్తుందని మండిపడ్డారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల రమేశ్, ఆశ కార్యకర్త యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీలత, లక్ష్మి, రజిత, పద్మ, సత్యలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

### అప్రెంటీస్ షిప్ మేళాకు స్పందన

కమాన్‌చౌరస్తా, మే 12: ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళాకు మంచి స్పందన వచ్చిందని కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కే అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు హైదరాబాద్, కరీంనరగ్‌కు చెందిన సంస్థలు ఈ మేళా నిర్వహించారు. సుమారు 40 మంది అభ్యర్థులు హాజరుకాగా 25మంది ఎంపికైనట్లు తెలిపారు. మిగిలిన వారికి ఆయా కంపెనీల్లో ఖాళీలను దశలవారీగా రిక్రూట్మెంట్ చేసుకుంటారని వివరించారు.

### తానాకాన్ 2025 - బ్రోచర్ ఆవిష్కరణ

విద్యానగర్, మే 12 : తెలంగాణ దవాఖానలు అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ 2025వ సంవత్సరానికి గాను కరీంనగర్‌లోని ప్రతిమ హోటల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి తానాకాన్ 2025-బ్రోచర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ వాసుదేవ దవాఖాన వారు మాట్లాడుతూ, మే 24, 25 తేదీల్లో తానాకాన్‌కు సంబంధించిన ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ జిల్లాల తానా లీడర్స్ సంయుక్తంగా తానాకాన్ 2025 ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ప్రతిమ హోటల్‌లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ చైర్మన్‌గా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ వాసుదేవ హాస్పిటల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ చాట్ల శ్రీధర్ సీవీఎం దవాఖాన, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డా. రాజకుమార్ ఆర్‌కే హాస్పిటల్, 25, 26వ తేదీలకు గాను కార్యక్రమ ఎలెక్ట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ అరుణ్ కటారి సాగర హాస్పిటల్, వైస్ చైర్మన్‌గా మహేందర్ బాబు, డాక్టర్ సునీల్ బాబు, డాక్టర్ మంజుల, డాక్టర్ శేషశైలజను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### ఆర్టీసీ లాజిస్టిక్ వస్తువుల వేలం

తెలంగాణచౌక్, మే 12 : ఆర్టీసీ లాజిస్టిక్‌లో బుకింగ్ చేసిన వస్తువులను వినియోగదారులు తీసుకపోకుండా మిగిలి ఉన్న వస్తువులను ఈ నెల 18, 19 రోజుల్లో వేల నిర్వహించనున్నట్లు ఆర్టీసీ లాజిస్టిక్ రీజనల్ మేనేజర్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాజిస్టిక్ నిబంధన ప్రకారం.. 40 రోజులకు పైబడి తీసుకపోని వస్తువులను బహిరంగ వేల వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో ఆసక్తి గల వారు ఉదయం 11 గంటలకు ప్రారంభకానున్న వేలలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని లాజిస్టిక్ కౌంటర్‌లో సంప్రదించాలని కోరారు.

# 'ఊయల'ను వినియోగించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఎంసీహెచ్‌లో క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్ ప్రారంభం



క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

విద్యానగర్, మే 12 : అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకునే వారు నిర్లక్ష్యంగా రోడ్లపై, చెత్త కుప్పల్లో వదిలేయవద్దని, శిశువుల సంరక్షణ ఏర్పాటు చేసిన ఊయల (క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్)లో వదిలెళ్లాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో, ప్రభుత్వ ప్రధాన దవాఖానలో మహిళా, శిశు, సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిశువుల స్వీకరణ కేంద్రంను కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. పుట్టిన శిశువులను వద్దనుకునే వారు ఊయలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. శిశువులకు అనారోగ్య సమస్యలు ఉన్నా వైద్యం అందించి శిశుగృహకు తరలించి పెంచి పెద్ద చేస్తారన్నారు. ఈ ఊయల వద్ద ఎలాంటి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండదని, ఊయలలో వేసిన వారిపై నిఘా, విచారణ వంటివి ఉండవని తెలిపారు. వివరాలు వెల్లడించినప్పటికీ అవి గోప్యంగా ఉంచుతారన్నారు. నేరుగా శిశువును అప్పగించాలనుకునే వారు ఫోన్ నంబర్ 9490881098కు సమాచారం ఇవ్వవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. త్వరలో జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి ప్రభుత్వ దవాఖానల్లో ఊయలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బస్టాండ్‌లో రైల్వేస్టేషన్లలోనూ ఊయల ప్రారంభిస్తామని వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్వో వెంకటరమణ, జిల్లా ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన దవాఖానలో ఊయలను డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీడబ్ల్యూవో సరస్వతి ప్రారంభించారు.

### నేత్రపర్వంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమాన్‌చౌరస్తా, మే 12 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు చక్రం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఆలయ ఈవో కందుల సుధాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయం త్రం సహస్రదీపాలంకరణ గరుడ వాహన సేవ ఘనంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

### డీసీఎం వ్యాన్ ఢీకొని గొర్రెలు మృతి

వీణవంక, మే 12 : మండలంలోని వీణవంక శివారులో రోడ్డుపై వెళ్తున్న గొర్రెలను డీసీఎం వ్యాన్ ఢీకొన్న ఘటనలో నాలుగు గొర్లు మృతిచెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిన్నాల సమ్మయ్య గ్రామ శివారులో గొర్లను మేపుతూ రోడ్డు దాటిస్తుండగా మామిడాలపల్లి నుంచి సీడ్ వరి బస్తాల లోడ్‌తో కరీంనగర్‌కు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొన్నది. ఈ ఘటనలో నాలుగు గొర్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతిచెందిన గొర్ల విలువ సుమారు రూ.35 వేల వరకు ఉంటుందని, సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించినట్లు పేర్కొన్నారు.

### ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ రూరల్, మే 12 : ఉరేసుకొని ఒకరు ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన మోకినపల్లి శ్రీనివాస్ (32) గతేడాదిగా కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడని, ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాడు. కాగా, పురుమల్ల యాదగిరి, భూపతి పాపయ్య, రెడ్డిరాజు, నగునూర్ గోపితో కలిసి ఆయన ఇసుక క్వారీ, హైదరాబాద్‌లోని భూముల పెట్టుబడులు పెట్టాడని, కాని, శ్రీనివాస్‌కు ఇవ్వాల్సిన డబ్బులపై ఆ నలుగురు వ్యక్తులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడంతో పాటు మానసికంగా వేదిస్తుండడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భ్యార అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి కేసు నమోద్ చేసినట్లు తెలిపారు.

### పథకాల అమలు ప్రక్రియలో వేగం పెంచాలి

కలెక్టరేట్, మే 12 : ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్ యువ వికాసం వంటి పలు ప్రభుత్వ పథకాల అమలు ప్రక్రియలో వేగం పెంచాలని, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్త రేషన్‌కార్డుల ప్రక్రి య శరవేగంగా నిర్వహించాలని, దీనిని తహసీల్దార్లు పర్యవేక్షించాలని సూచించారు. అన్ని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ ఇండ్ల పనులు పూర్తి చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గ్రౌండింగ్ పూర్తి చేసి, బ్యాంకర్లకు పంపించాలన్నారు. ఆర్డీవో మహేశ్వర్, మైనార్టీ సంక్షేమాధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో

విద్యానగర్, మే 12 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, డీఐవో సాజిదా, పీవోఎంసీహెచ్ సనజ వేరియాతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖాన ఆవరణలోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈహెల్త్ వెల్నెస్ సెంటర్లో ఉద్యోగులకు ఎంప్లాయ్ హెల్త్ స్కీం ద్వారా అందుతున్న సేవలు, పెన్షనర్స్‌కు, జర్నలిస్టులకు ఈ హెల్త్ వెల్నెస్ సెంటర్ ద్వారా అందుతున్న అవుట్ పేషెంట్ విభాగం సేవలను, లాబరేటరీ పరీక్షలకు సంబంధించిన వివరాలను, వారికి ఇస్తున్న మందుల వివరాలకు సంబంధించిన ఫార్మసీ రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడికి వచ్చిన పెన్షనర్స్, ఉద్యోగులతో మాట్లాడారు. వెల్నెస్ సెంటర్‌కు సంబంధించిన సేవలు అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### డ్రగ్స్‌పై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, మే 12 : సివిల్ ప్రొటెక్షన్ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు కరీంనగర్ రూరల్ నిరంజన్ రెడ్డి డ్రగ్స్‌పై అవగాహనలో భాగంగా సోమవారం సేనో టూ డ్రగ్స్ అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాలేజీలు ప్రారంభించిన అనంతరం సంయుక్తంగా డ్రగ్స్‌పై వివిధ కాలేజ్‌లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

గన్నేరువరం, మే12: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై నరేశ్, ట్రైనీ ఎస్ఐ అరుణ్, సిబ్బంది ఉన్నారు.

### చామనపల్లి పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

కరీంనగర్ రూరల్, మే 12: మండలంలోని చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఓ గర్భిణీకి వైద్య సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. చెర్లభూత్కూర్ గ్రామానికి చెందిన కౌసల్య గర్భిణీ పురిటినొప్పులతో చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరింది. వైద్యులు మనోహర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది స్వరూప, శైలజ, విమల, జమున సాధారణ ప్రసవం చేయగా, బిడ్డకు జన్మించింది. కౌసల్య మూడో కాన్పుకోసం పీహెచ్‌సీలో చేరిందని తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వైద్యుడు మనోహర్ తెలిపాడు.

### బుద్ధ జయంతి వేడుకలు

తెలంగాణచౌక్, మే12: నగరంలోని జ్యోతిబాపూలే మైదానంలో జ్యోతి బాపూలే సీనియర్ అండ్ జూనియర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం బుద్ధ జయంతి వేడుకులను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, వాకర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు తిరుపతిగౌడ్, కొమురయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

### త్రికరణ శుద్ధితో ఉద్యోగం చేస్తేనే గుర్తింపు



కేక్‌కట్ కట్‌చేస్తున్న సీఐ శ్రీలత

విద్యానగర్, మే 12 : ప్రధాన మంత్రి అయినా.. ముఖ్యమంత్రి అయినా.. డెలివరీ అయ్యాక మొదటగా ఎత్తుకునేది నర్సులేనని.. పైసల కోసం కాకుండా.. త్రికరణ శుద్ధితో ఉద్యోగం చేస్తేనే నర్సులకు గుర్తింపు ఉంటుందని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీలత సూచించారు. వరల్డ్ నర్సింగ్ డే సందర్భంగా సోమవారం కరీంనగర్ మెడికవర్ దవాఖానలో నర్సింగ్ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐ శ్రీ లత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం కేక్‌కట్ చేశారు. నర్సింగ్ విధులు రిస్క్‌తో కూడుకున్నవి అయినప్పటికీ చిత్తశుద్ధితో పనిచేస్తూ పేషెంట్‌కు ధైర్యం, నమ్మకం కల్పించాలన్నారు. అనంతరం దవాఖానలో ప్రతిభ చూపిన నర్సులకు అవార్డులు అందజేశారు. మెడికవర్ దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనెస్థిషియా వైద్యుడు వినయ్, క్రిటికల్ కేర్ నిపుణుడు ఉపేందర్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్లు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### నర్సులకు సన్మానం

విద్యానగర్, మే 12 : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రేకుర్తి బస్తీ దవాఖానలో పనిచేస్తున్న నర్సులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ మానువాడ శంకర్ మాట్లాడుతూ, ప్రపంచంలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. క్లబ్ కార్యదర్శి లయన్ ననువాల గిరిధర్ రావు, డైరెక్టర్ తాజా మాజీ కార్పొరేటర్ లయన్ రాజశేఖర్, డైరెక్టర్లు లయన్ సంపత్, లయన్ సుమన్, స్టాఫ్ నర్సు లావణ్య, విజయరాణి, అలీమా, ఆశ కార్యకర్త విజయలక్ష్మి, సువర్ణ, సిబ్బంది అరుణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

I Thammanaveni Sadaiah S/o. Yellaiah, H.No. 1-12, Village, Kukkalagudur, Palakurthy Mandal, Peddapalli District. Have Changed My Name As Thammanaveni Sadankumar Yadav S/o. Yellaiah.

**పేరు మార్చబడినది**

నేను సంజీవ్ నూతుల S/o. నూతుల కిష్టరెడ్డి (పాత పేరు) వయస్సు:50 సం||రాలు, ఇ.నెం. 7-86/1, రేచపల్లి , సారంగపూర్ మండలం జగిత్యాల జిల్లా తెలంగాణ. నా పేరు మార్చబడినది . నూతుల సంజీవరెడ్డి S/o. నూతుల క్రిష్ణారెడ్డి ( కొత్త పేరు)

**PASSPORT LOST**

★ Namala Mohan S/o.Namala Mallaiah H.No. 5-35, RR Colony, Anupuram,Vemulawada Mandal, Rajanna Sircilla Dist. My Pass Port No. E5597998 Lost Travelling by Bike From Anupuram to Vemulawada any one find Please Call : 9440050092
NTK-00000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189